క్లుప్తంగా

చర్చిల అభివృద్ధికి సహకారం

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



విరాళం అందజేస్తున్న మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: చర్చిల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటీ గ్రామ కమాన్ సమీపంలోని మరణాత చర్చిలో వంట శాల నిర్మాణానికి రూ.6 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు కార్పొరేటర్ మెట్టు కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లలిత సోమిరెడ్డి , శంకర్,చర్చ్ పాస్టర్ భాస్కర్ రావు,పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం పల్పనూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన పార్వతీ పరమేశ్వర ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆలయ నిర్మాణం చేపట్టిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బంటు శ్రీనివాస్, ఆలయ నిర్మాణ దాత హరీష్, నాయకులు నరసింహ రెడ్డి, శ్రీకాంత్, వీరేందర్, పాల్గొన్నారు.

అండర్ -14 క్రికెట్ జట్టుకు ఎంపిక



శ్రీజన్ రెడ్డి



సూరజ్ ప్రసాద్

పటాన్‌చెరు టౌన్: ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ -14 క్రికెట్ జట్టుకు పటాన్‌చెరుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా క్రికెట్ జట్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలో డివిజన్ పరిధిలోని ఏపీఆర్ కాలనీకి చెందిన శ్రీజన్‌రెడ్డి, సూరజ్ ప్రసాద్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. జిల్లాస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్న లక్ష్యంతో వారికి శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న గోవర్ధన్‌రెడ్డి తదితరులు

జిన్నారం (పటాన్‌చెరు): స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం గుమ్మడిదల మండల కేంద్రంలో సొంత నిధులతో స్వామి వివేకానంద విగ్రహ ఏర్పాటుకు స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, విష్ణువర్ధన్, భాస్కర్ రెడ్డి, మొగులయ్య, బాలకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సదాశివపేట(సంగారెడ్డి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని కౌన్సిలర్ ఓదెల రాజేశ్వరి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 11వ వార్డులో కౌన్సిలర్ రాజేశ్వరీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని వెల్‌నెస్ ఆస్పత్రి వైద్యులు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శివరామకృష్ణ, డాక్టర్ రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

కోట్లు వెచ్చించారు.. నిర్వహణ మరిచారు

రూ.3 కోట్లతో పార్క్ నిర్మాణం

- పనిచేయని ఆట పరికరాలు
- అసంతృప్తిగా స్థానిక ప్రజలు
- పట్టించుకోని అధికారులు

సంగారెడ్డి రూరల్ : జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని రాజీవ్‌పార్క్ పరిస్థితి అధ్వానంగా తయారైంది. రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్క్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితంలో మనిషి శారీరక, మానసిక ఆవేదన నుంచి బయటపడేందుకు నిత్యం వ్యాయామం ఎంతో అవసరం. వ్యాయామం కోసం వచ్చేవారికి కనీస సౌకర్యాలు లేక నిరాశ చెందుతున్నారు. ప్రజలు సేద తీరే పార్క్‌లో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. పార్కుకు వచ్చిన వారంతా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహణ గాలికి వదిలేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ పెద్దలు , సంబంధిత అధికారులు దృష్టి సారించి పార్కును పర్యాటక కేంద్రంగా తయారు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



రాజీవ్ పార్క్ ప్రవేశ ద్వారం

కాంగ్రెస్ హయాంలో నిర్మాణం..

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 3 కోట్లతో 2013లో పార్కును ఏర్పాటు చేశారు. మొదట్లో పార్క్ ఎంతో ఆహ్లాదంగా, అందంగా ఉండేది. పార్క్‌కు వచ్చేవారు ప్రశాంతంగా వ్యాయామం, సేదతీరే వారు. చిన్నారులకు రూ.5 , పెద్దవారికి రూ. 10 నెల వారి కార్డు కలిగిన వారికీ రూ. 250 చొప్పున వసూలు చేసి పార్కు నిర్వహణ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక పార్క్ నిర్వహణ గాలికి వదిలేశారు. దీంతో అస్తవ్యస్తంగా తయారై ఆకతాయిలకు అడ్డాగా మారింది.

పని చేయని ఆట వస్తువులు

పార్క్‌లో చిన్నారులు ఆడుకునే ఆట వస్తువులు పని చేయడం లేదు.. తుప్పు పట్టిన జిమ్ పరికరాలు కనిపిస్తున్నాయి. సరదాగా ఆడుకుందామని పార్కుకు వస్తున్న చిన్నారులకు నిరాశే ఎదురవుతుంది. పార్కులో సుమారుగా 50కి పైగా ఆట వస్తువులు ఉన్నప్పటికీ అందులో సగానికి పైగా చెడిపోయాయి. మరమ్మతులు చేయించక తుప్పు పట్టి పాడైపోయాయి. దీంతో చిన్నారులు వాడితో ఆడటం వల్ల గాయల పాలవుతున్నారు. నిత్యం వాకింగ్‌కు వస్తున్న వారికి ఎటువంటి సౌకర్యాలు లేక అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్కులో ప్రత్యేకంగా నిర్మించిన జలవిహార్ ప్రస్తుతం పిచ్చి మొక్కలతో నిండి వాడుకలో లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారు స్పదించి పార్కును వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



పాడైన ఆట పరికరాలు

పార్కును బాగు చేయాలి



వ్యాయామం చేయడానికి సరైన పరికరాలు లేక ప్రైవేట్ జిమ్‌లోకి వెళ్తే అక్కడ నెలకు రూ4వేల నుంచి రూ. 5 వేలు వసూలు చేస్తున్నారు. అంత డబ్బులు పెట్టే స్తోమత లేక ఇందులోనే అరకొర వస్తువులతో సాధన చేస్తున్నా.. అధికారులు స్పందించి పార్కుని బాగు చేసి అన్ని పరికరాలతో అందుబాటులోకి తీసుకురావాలి.

– సాయికుమార్, శాంతినగర్

మరమ్మతులు చేయించండి

నేను రోజు ఉదయం పార్కుకు వాకింగ్ చేయడానికి వస్తాను. వాకింగ్ ట్రాక్ మొత్తం పాడై నడవడానికి చాలా ఇబ్బందిగా తయారయింది. పార్క్‌కు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

–యాదమ్మ, సంగారెడ్డి

నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండ

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఆపద సమయంలో సీఎం సహాయనిధి నిరుపేదలకు ఆపన్నహస్తం అందిస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల గ్రామానికి చెందిన భోగయ్య కుమారుడు శ్రీనివాస్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సాయం కోసం స్థానిక ఎమ్మెల్యేకు విన్నంచుకోగా సీఎం సహాయనిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజాపాలన అందిస్తున్నామని అన్నారు.



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

హనుమాన్ చాలీసాతో ప్రశాంతత

- బజరంగ్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాములు

పటాన్‌చెరు టౌన్: హనుమాన్ చాలీసా పారాయణంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బజరంగ్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు శివ రాములు అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామంలోని మల్లన్నస్వామి దేవస్థానంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బజరంగ్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు శివ రాములు విచ్చేశారు. ముందుగా ప్రత్యేక పూజల్లో పాల్గొని, అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు పవన్, జిల్లా కార్యదర్శి ప్రకాశం, న్యాయవాది నాగరాజు యాదవ్, స్వామి వివేకానంద సేవ సమితి జిల్లా అధ్యక్షుడు శేషాద్రి పాల్గొన్నారు.



హనుమాన్ చాలీసాలో పాల్గొన్న భక్తులు

మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, బైరెడ్డి తదితరులు

నారాయణఖేడ్: పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పోర్ట్ అథారిటీ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ పటోళ్ల సంజీవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మండలంలోని అనంతసాగర్ గ్రామంలో మైలారం మల్లన్న జాతర మహోత్సవంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి పటోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పాల్గొని మల్లన్నస్వామిని దర్శించుకొన్నారు. అనంతరం గ్రామస్తులు, పెద్దలు వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివరాథోడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడు పండరిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, అధ్యాపకులు

సంగారెడ్డి జోన్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం 5వ వార్షిక పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఐఐటీలో హైబ్రిడ్‌మోడ్‌లో నిర్వహించింది. విద్యార్థుల ఆనాటి జ్ఞాపకాలు, విజయాలను పంచుకున్నారు. 2013 బ్యాచ్‌కు చెందిన లెగసీ ప్రాజెక్టు అయిన కెఆర్‌సీ రికార్డింగ్ స్టూడియోను డైరెక్టర్ బీ.ఎస్.మూర్తి ప్రారంభించారు. కేఆర్‌సీ ప్రారంభోత్సవం ఒక మైలు రాయిని సాధించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, పూర్వవిద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

కల్హేర్(నారాయణఖేడ్): అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధమైన ఘటన మండలంలోని మార్డితండాలో ఆదివారం చోటు చేసుకుంది. తండాకు చెందిన హెమ్లనాయక్‌కు సంబంధించిన గుడిసెకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. వంట సరుకులు, సామగ్రి దగ్ధమైంది. ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని బాధితుడు కోరారు. మాజీ ఎంపీపీ గుర్రపు సుశీల అంజయ్య బాధితుడిని పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, నాయకులు ఉప్పరి అంజయ్య ఉన్నారు.

అమరజీవికి ఘన నివాళి

నారాయణఖేడ్: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని నారాయణఖేడ్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మాణిక్‌ప్రభు మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణాలు త్యాగం చేసిన మహనీయుడని, నేటి తరం యువతకు ఆదర్శ ప్రాయులని కొనియడారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కోటగిరి సత్యం, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆత్మకూరు రాజు, సంఘం నాయకులు లక్ష్మణ్, బీఎం ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ గోలి రాములు, భూషణం పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

జహీరాబాద్ టౌన్: సంగారెడ్డిలో నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఏరియా కమిటీ సభ్యుడు మహిపాల్ కోరారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జీఓఎస్ కాలనీలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ..పట్టణంలో తొలిసారి రాష్ట్ర 4వ మహా సభలను జనవరి 25న జరగనున్నాయన్నారు. సీపీఎం విధానాలు, పోరాటాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి మహాసభలకు ఆర్థికంగా సహకరించాలని కోరుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సలీమోద్దీన్, తిరుపతి,రాజేష్, బక్కన్నలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

పటాన్‌చెరు టౌన్: గ్రూప్–2 పరీక్షలు పటాన్‌చెరులో 10 కేంద్రాల్లో నిర్వహించారు. పరీక్షా కేంద్రం లోపలికి గంట ముందే అభ్యర్థులను అనుమతించారు. పరీక్ష ప్రారంభమయ్యాక వచ్చిన వారిని అనుమతించలేదు. పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో ముగ్గురు, జెడ్పీహెచ్ఎస్ కేంద్రంలో ఒకరు, మంజీరా డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒకరు వెనుదిరగాల్సి వచ్చింది. మొత్తం పది కేంద్రాల్లో 3207 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా కేవలం 1596 మంది మాత్రం హాజరయ్యారు. 1611 మంది మాత్రం గైర్హాజరయ్యారు. పోలీసులు ఆయా పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు నిర్వహించారు.

సంతోషంగా పండుగ జరుపుకోవాలి

- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి జోన్: ప్రతి ఒక్కరు క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డిలోని సీఎస్ఐ చర్చిలో ఏసుక్రీస్తు జయంతి జాతర మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బిషప్ రూబెన్ మార్క్ భక్తులకు దైవ సందేశం చదివి వినిపించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో కలిసిమెలసి పండుగను జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు ఆల్బర్ట్, సునీల్, ప్రవీణ్, జయకుమార్, జైరాజ్, భాస్కర్‌రావు, జాన్ వెస్లీ, కాంగ్రెస్ నాయకులు తోపాజి అనంతకిషన్, కూనసంతోష్, కిరణ్‌గౌడ్, చర్చి పాస్టర్ జర్జ్ ఎబినేజర్ రాజు, పాస్టర్లు, భక్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

అభ్యర్థుల నుంచి డబ్బులు తీసుకోవద్దు

- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి టౌన్ : పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థుల నుంచి లగేజ్ కౌంటర్ల కోసం డబ్బులు తీసుకోవద్దని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం గ్రూప్– 2 పరీక్ష సందర్భంగా సంగారెడ్డి మండలంలోని ఎమ్మెన్నార్ కళాశాలలో అభ్యర్థుల నుంచి కొందరు నిర్వాహకులు సెల్‌ఫోన్, లగేజ్ డిపాజిట్ కోసం రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థుల నుంచి డిపాజిట్ కోసం ఎక్కడ కూడా ఎటువంటి డబ్బులు తీసుకోవద్దని తీసుకున్న నగదును అభ్యర్థులకు తిరిగి ఇవ్వాలని కళాశాల యాజమాన్యాన్ని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

మునిపల్లి(అందోల్): సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి గంధం మల్లికార్జున్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం సంగారెడ్డిలో 9 రోజులుగా సమ్మె చేస్తున్న సీఆర్‌పీలకు మద్దతుగా ఆదివారం శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని అర్హతలు ఉండి సంవత్సరాలుగా పని చేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా వారి జీతాలు పెరగడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేసి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ కవిత, ఎంఐఎస్ సురేష్, సీఆర్‌పీ పాల్గొన్నారు.



సంగారెడ్డి జోన్: హోమాలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో దత్తజయంతి ఉత్సవాలు

జిల్లా వ్యాప్తంగా దత్తజయంతి ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల హోమాలు, సామూహిక సత్యరానాయణ వ్రతాలు చేశారు. దత్తజన్మోత్సవ హరికథ, గీత పారాయణం నిర్వహించి.. భక్తులకు అన్నదానం చేశారు.



రామచంద్రాపురంలో..



కల్హేర్: దిండి ఊరేగిస్తున్న భక్తులు



హత్నూర(సంగారెడ్డి): దత్తాత్రేయ క్షేత్రంలో పూజలు



వట్‌పల్లి(అందోల్): సత్యనారాయణ వ్రతాలు చేస్తున్న దంపతులు



రామచంద్రాపురం: భెల్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో..

నేటి నుంచి పద్మనాభస్వామి ఉత్సవాలు

సంగారెడ్డి : జిల్లాలోని చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలో వెలసిన అతి పురాతనమైన లక్ష్మీ అనంత పద్మనాభస్వామి పునశ్చరణ మహోత్సవాలు నేటి నుంచి వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలను నిర్వహణకు ఆలయ పాలకవర్గం ఏర్పాట్లు పూర్తి చేసింది. పరిపూర్ణ దేవాలయం, భవ్యమైన ఆలయ మహా మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాలకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ హాజరుకానున్నారు. నేటి నుంచి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



భక్తుల విరాళంతో నిర్మించిన మహా మంటపం

భారీ ఏర్పాట్లు చేశాం



అనంత పద్మనాభ స్వామి పునశ్చరణ మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాం. వేద పండితులకు ప్రత్యేకంగా యాగశాలను ఏర్పాటు చేశాం. ఊరంతా కాషాయ జెండాలతో అలంకరించి, ఆళ్లగడ్డ నుంచి తెప్పిస్తున్న 42 ఫీట్ల ధ్వజస్తంభానికి స్వాగతం పలికెందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశాం. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

–భానూరి లక్ష్మయ్య, ఆలయ కమిటీ చైర్మన్